క్లుప్తంగా

గడువు పొడిగింపు

శాయంపేట : రెండో విడత దళితబంధు పథకానికి దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల రెండు రోజులు ప్రభుత్వ సెలవులు రావడంతో ఈ నెల 12 వ తేదీ వరకు గడువు పొడగిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గీత సహకార సంఘం ఎన్నిక



శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షుడు

కమలాపూర్: గీత పారిశ్రామిక సహకార సంఘం కమలాపూర్ పట్టణ అధ్యక్షుడిగా జేరిపోతుల శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఆవరణంలో బుధవారం గీత కార్మికులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పబ్బు కొమురయ్యగౌడ్, కోశాధికారిగా బాలసాని రమేష్‌గౌడ్, డైరెక్టర్లుగా జక్కు రాజుగౌడ్, పబ్బు రాజుగౌడ్, మేడిపెల్లి రాములుగౌడ్, దొనికెల కుమారస్వామిగౌడ్, పర్కాల వీరగౌడ్, తోడేటి సదానందంగౌడ్ ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బాసాని రాజమణి, బత్తుల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎంపీటీసీ, ఉపసర్పంచ్ జమున సుమన్ బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందించినట్లు తెలిపారు. మోహన్, కార్తిక్, పాపయ్య, శ్రీనివాస్, కిరణ్, సాయి, అనిల్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు తరలిరావాలి

శాయంపేట : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తరలిరావాలని ఎంపీపీ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

దామెర: నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (జాతీయ నిర్మాణ రంగ సంస్థ) అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ కుమార్ బుధవారం ప్రకటనలో కోరారు. లేబర్ కార్డు కలిగిన 45 సంవత్సరాల్లోపు వయస్సు గల వారికి ఈ నెల 8 నుంచి 15 రోజుల పాటు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెషనరీ, పెయింటింగ్, మార్బుల్స్, టైల్స్ ఫ్లోరింగ్, ఎలక్ట్రిషన్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు రోజుకు 300 చొప్పున 4500 స్టయిఫండ్‌ను శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు అందించనున్నట్లు తెలిపారు. న్యాక్ స్కిల్ అప్‌గ్రెడేషన్ సర్టిఫికెట్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. టీషర్టు, సెఫ్టీ హెల్మెట్, స్టేషనరీ కిట్ అందిస్తామని వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు లేబర్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నిర్ణయించిన సమయంలో హాజరు కావాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ధర్మసాగర్: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ బుధవారం ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాదిగల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ అని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఆరుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బీఆర్‌ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అరూరి విశాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరూరి రమేష్, సర్పంచ్ సంపత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తన జన్మదినాన్ని పురస్కరించుకుని 27మంది అనాథ విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు అరూరి విశాల్ ప్రకటించారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టిన విద్యార్థులు
- ఆకట్టుకున్న దాండియా



పరకాల : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఉట్టికొడుతున్న బిట్స్ విద్యార్థులు

ఎల్కతుర్తి: మండలం వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేశాధారణలతో అలరించగా.. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆల్టిట్యూడ్ పాఠశాలలో కరస్పాండెంట్ కార్తీక్‌రావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థిని, విద్యార్థుల శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

కమలాపూర్: మండల కేంద్రంలోని కేరళ మోడల్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో కోలాటాలు ఆడుతూ, దాండియా నృత్యాలతో సాంస్కృతిక ప్రదర్శనలిస్తూ ర్యాలీ నిర్వహించారు. కేరళ మోడల్ స్కూల్, టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. ప్రిన్సిపాల్స్ తూముల దేవేందర్‌రావు, చల్లూరి ప్రభాకర్, హెచ్‌ఎంలు పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల: పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ (బిట్స్)లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నృత్యాలు చేశారు. మరోవైపు ఉట్టికొడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా బిట్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జన్మతో ఈ సృష్టికి ఎంతో మేలు జరిగిందన్నారు. చెడు, మంచి సాధించడం కోసం శ్రీకృష్ణుడు ఎన్నో మహిమలతో ప్రతి ఒక్కరిలో గొప్ప దేవుడిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోసఫ్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో..



కమలాపూర్‌లో..



దామెరలో..

దామెర: మండల కేంద్రంలోని ఏకశిలప్రైమ్ పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేశాధారణతో సందడి చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్టికొట్టుడు కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలని కోరారు. విద్యార్థులకు తెలుగు చదువుతో పాటు తెలుగు సాంస్కృతిపై మక్కువ పెంచే విధంగా చూడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వస్కుల మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ నవీన్ పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతి పాటిస్తే అధిక లాభాలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

ధర్మసాగర్: చేపల పెంపకంలో శాస్త్రీయ పద్ధతి పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేష్ అన్నారు. మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకంలో అవలంభించే ముఖ్య అంశాలైన చేపల చెరువుల స్థల ఎంపిక, చెరువు తవ్వడం, ఎరువుల వినియోగం, చేప పిల్లల ఎంపిక, మేత యాజమాన్యం, నీటి యాజమాన్యం, చేపల వ్యాధుల నిర్ధారణ, వాటి నిర్మూలన గురించి వివరించారు. అదే విధంగా శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకంలో నూతన సాంకేతిక రంగాలైన పంజర పద్ధతిలో చేపల పెంపకం, సమీకృత చేపల పెంపకం, రీ సర్కులేటెడ్ ఆక్వా కల్చర్, బయో ఫ్లాగ్‌లో చేపలు పెంచే సాంకేతిక పద్ధతి తదితర అంశాలపై మత్స్యకారులకు తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో చేపలను పెంచి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కుమారస్వామి, మత్స్యకారులు, రైతులు పాల్గొన్నారు.

కూలి పెంచాలి.. భూములు పంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్: కూలీ పెంచి భూమి పంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారి కూలీ రేట్లను పెంచాలని, నిరుపేదలకు ప్రభుత్వ భూములు కేటాయించి డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం స్థానిక తహసీల్దార్ మాధవికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లత, సాంబయ్య, కమలాకర్, రమేష్, ఉపేందర్, రాజేశం, రమాదేవి, తిరుమల, రజియా, మహేందర్, లక్ష్మీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9నుంచి దర్గా ఉర్సు

హన్మకొండ అర్బన్: ఈనెల 9నుంచి 15వ తేదీ వరకు జరగనున్న కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశించారు. పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఉర్సు ఉత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

సల్లంగ చూడు పోచమ్మతల్లీ



పరకాల : బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళలు



ఆత్మకూరు : మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పరకాల: శ్రావణమాసం సందర్భంగా బుధవారం పట్టణంలో పోచమ్మతల్లి బోనాల వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు సాంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని నృత్యాలతో సందడి చేశారు. వీధుల నుంచి బోనాలతో బయలుదేరిన భక్తులు పోచమ్మ దేవాలయానికి చేరుకొని కోళ్లు, మేకలను నైవేద్యంగా సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం పోచమ్మతల్లి బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మతల్లీ సల్లగ సూడు అంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా బోనాలు, శాకలు సమర్పించారు.

దామెర: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో పోచమ్మ బోనాల పండుగ బుధవారం వైభవంగా జరిగింది. మహిళలు బెల్లంతో తయారు చేసిన బోనం కుండలతో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో నృత్యాలు చేస్తూ పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేసిన అనంతరం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, టెంకాయలు, నూతన వస్త్రాలు, బోనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గొర్రె పోతులు, కోళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడుతల్లీ అంటూ పోచమ్మతల్లిని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ తాటికొండ భద్రయ్య ఆధ్వర్యంలో పకడ్బంది చర్యలు చేపట్టారు. కమిటీ సభ్యులు తాటికొండ భిక్షపతి, శంకర్, రాజేందర్, శంకోజు పెద్దన్నచారి, తాటికొండ నాగరాజు, తాటికొండ అశోక్ ఎద్దేత్తున భక్తులు పాల్గొన్నారు.



దామెర : ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గండ్ర దంపతుల చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే గండ్ర దంపతుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కొప్పుల గ్రామస్తులు, నాయకులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామం నుంచి మూలతాళ్ల మీదుగా పరకాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 26. 39 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. 12 గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చిత్రపాటాలకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాలాభిషేకం చేశారు. నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ గోలి మాధురిమహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రూ. 5కోట్ల 80లక్షలతో కొప్పుల గ్రామం నుంచి మూలతాళ్ల మీదుగా పరకాల వరకు బీటీ రోడ్డు, రూ. 2కోట్లతో ఆర్ అండ్‌బీ రోడ్డు నూర్జహాన్‌పల్లి నుంచి రాజుపల్లి గ్రామానికి బీటీ రోడ్డు, కాట్రపల్లి నుంచి రాజుపల్లికి బీటీ రోడ్డు పనులు, రూ. 2 కోట్ల 20 లక్షలతో నూర్జహాన్‌పల్లి నుంచి వసంతాపూర్ వరకు బీటీరోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సామల మధుసూదన్, నాయకులు సామల భాస్కర్, తోట కుమారస్వామి, అట్ల తిరుపతి, గుర్రం సుధాకర్, మామిడి భద్రయ్య, బేతు ఆదిరెడ్డి, కుమ్మరి రాజయ్య, మేకల వెంకన్న, మామిడి భాస్కర్, పైల్ల సమ్మయ్య, పరికరాల కొమురెల్లి పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: ప్రభుత్వం నిర్దేశించిన హరిత హారం లక్ష్యం చేరుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలకు ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన మొక్కలు, నర్సరీల్లోని మొక్కల వివరాలు గ్రామాల వారిగా అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో ఉన్న మొక్కలను ప్రతీ ఇంటికి పంపిణీ చేసి నాటే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈజీఎస్ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. 14 రకాల పండ్ల తోటలు పెంచేందదుకు అందిస్తున్న సబ్సిడీ రాయితీలను వివరించారు. ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

శాయంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి అన్నారు. జాతీయ పోషణమాసం సందర్భంగా బుధవారం మండలంలోని ఆరెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గర్భిణీ, బాలింతలు పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వలన బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధులో దళారుల హవా



నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో దళారుల హవా నడుస్తుందని సీపీఐ మండల నాయకుడు అరికిళ్ల దేవయ్య మండిపడ్డరు. అర్హులకు కాకుండా అనర్హులకు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. దళితబంధును అర్హులకు మంజూరు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్, బీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు దళితబంధు ఇప్పిస్తామని చెప్పుకుంటూ దళితుల నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. దళితబంధు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వస్తున్న వారిని గుర్తించి మాయ మాటల చెప్పి డబ్బులు వాసూళ్లు చేస్తున్నారని అన్నారు. అక్రమ సంపాదనకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నాయకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొదటి దఫా దళితబంధు మంజూరు జాబితాలో ఎక్కువశాతం బీఆర్‌ఎస్ నాయకులే ఉన్నారని ఆరోపించారు. మళ్లీ బీఆర్‌ఎస్ నాయకులకే మంజూరు చేస్తే స్థానిక ఎమ్మెల్యే గండ్రకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్, సీపీఐ నాయకులు మారెపల్లి క్రాంతికుమార్, వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు మారెపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ పోషణ్‌పై అంగన్‌వాడీలకు అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష

కమలాపూర్: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కమలాపూర్, ఎల్కతుర్తి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మిషన్ పోషణ్-2 కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ రాష్ట్రీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని థీమ్ పోషకాహారం, సంపన్నమైన, విద్యావంతులైన, సాధికారత కలిగిన భారతదేశం అనే అంశాలపై 30 రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై, పోషణ్ పంచ సూత్రాలపై నాలుగు వారాల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి, తల్లిపాల ప్రాముఖ్యత, కూరగాయల్లో లభించే పోషక విలువలు, పరిసరాల పరిశుభ్రత, ఔషధ మొక్కల ఉపయోగాలు, ఇంటి పరిసరాల్లో కూరగాయల పెంపకం, చిరుధాన్యాలు, వర్షపు నీటి ప్రాముఖ్యతలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష వివరించారు. అనంతరం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, సుజాత, కల్యాణి, స్వర్ణలత, రాజ్యలక్ష్మి, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దామెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 సంవత్సరం నుంచి నేటి వరకు 200 శాతం నిత్యవసర సరకుల ధరలు పెంచి సామాన్యుడి నడ్డీ విరుస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరంచేసి ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దొగ్గెల తిరుపతి, నాయకులు గోవిందు ప్రతాప్, రవికుమార్, సారంగపాణి, సూర్యనారాయణ, రమేష్, ప్రభాకర్, కూచన సుభాష్, రాములు పాల్గొన్నారు.

ప్రపంచానికే భారతదేశం ఆదర్శం



మట్టిని సేకరిస్తున్న డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రపంచానికే భారతదేశం ఆదర్శమని, నాగరికత ఎక్కడాలేని సమయంలో భారత్‌లోనే వెల్లివిరిసిందని, సాంకేతిక అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అమృతకలశానికి ప్రత్యేక పూజలు చేసి పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. ఇంటింటి నుంచి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగవీరుల గుర్తింపుగా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ నేతృత్వంలో పవిత్ర అమృత స్మృతివనం నిర్మించనున్నట్లు వివరించారు. దేశ రక్షణ కోసం ప్రణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మేరా మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయమని అన్నారు. అన్ని రాష్ట్రాలలోని ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపిస్తున్నారని, స్మృతివనం నిర్మాణంలో మన తెలంగాణ మట్టి కూడా ఉండడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రతిఒక్కరూ మట్టిని సేకరించాలని కోరారు. పీఎం మోదీ భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆర్‌టీఐ కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, కిసాన్‌మోర్చా కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, నాయకులు గుల్లపెల్లి వెంకటేశ్వర్లు, వెల్దె సదానందం, పూజరి సత్యనారాయణ, మండల కార్యదర్శి బయ్య పైడి, సాంబయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.